# పశ్చాత్తాపం

శ్రీమతి
జె. ఉమాదేవి

వేణు చాలా స్థితి పరుడు. చదువుకున్నవాడు కూడాను. బుద్ధిమంతుడు. రూపసి. రామారావుగారు తన కుమార్తెకు వేణు అన్నివిధాలా తగిన వరుడని యెంచుకున్నాడు. ఇరువది వేల వరదక్షిణతో వేణూ జయల వివాహం జరిగింది.

వివాహానంతరం రెండు మాసాలకే వేణుకు విజయనగరంలో సర్కిల్ ఇనస్పెక్టరు పదవి లభించింది. కుటుంబంతో సహా వెళ్లి చార్జి వప్పగించుకున్నాడు.

జయ డాక్టరు పరీక్ష ప్యాసయింది. స్త్రీ స్వాతంత్ర్యమంటే భర్తను యెదిరించడమనుకునే వాళ్లలో ఆమె ప్రథమురాలు. తనుకూడా తన స్వార్జితంమీద ఆధారపడి వుండాలని, పాశ్చాత్య దేశపు స్త్రీలాగా తనుకూడా వుద్యోగంచేసి సంపాదించాలని ఆమె వూహ. ఆమెకు పాశ్చాత్య సభ్యతంటే చాలాయిష్టం. వాళ్ల వేషభాషలనుచూచి ఆనందిస్తూ వుండేది. చివరకు యెలా అయితేనేం తనుకూడా విజయనగరం జనరల్ హాస్పటలులో వుద్యోగం సంపాదించుకుంది.

భార్య భర్తా యిద్దరూ వుద్యోగం చేస్తే వండిపెట్టే దిక్కు కనిపించలేదు. హోటలు భోజనంచేసే యోగంపట్టింది. హోటలు నూనెకూరలూ, ఆ అశుభ్రపు వంటా చూచి వేణు అసహ్యించుకునేవాడు. కాని పాపమేమి చేస్తాడు! ఏదియినా అంటే వండుకుతినమంటుంది. ఆ కాస్తమాట అనిపించుకోవట మెందుకని వేణు తనమర్యాద తాను దక్కించుకునేవాడు.

ఈవిధంగా రెండుమూడు సంవత్సరాలు గడిచిపోయాయి. వేణూ జయలకు పుత్రుడు జన్మించాడు. వేణు హోటల్ భోజనం యికనైనా తప్పుతుందనుకున్నాడు. పిల్లలు లేనంతవరకు ఎలాతిరిగినా జయ పుత్రపోషణార్థమై తప్పకుండా వుద్యోగానికి రాజీనామా యిస్తుందనుకున్నాడు. ఆమెలో కూడా భారతీయ రణీమత్వం మొలకెత్తుతుందనుకున్నాడు. కాని అతని మనోభావాలన్నీ నీటిలోని మూటలైనాయి.

పిల్లవానికి అయిదవమాసం రాగానే జయతిరిగి ఉద్యోగంలో ప్రవేశించింది. పిల్లవాని పోషణ నిమిత్తమై ఒక తాయిని పెట్టింది.

ఆమే వంటకూడా చేసేది. పుత్రజననం వల్ల హోటల్ భోజనం మాత్రం తప్పింది.

ఒకరోజు జయవంట్లో సుస్తీగా నుండుటవల్ల సెలవుపెట్టి యింటిదగ్గరనే వుంది. సాయంకాలం తన యింటిచుట్టూవున్న తోటలో పూలమొక్కల మధ్యవున్న రాతిసోఫామీద బేబీని ఆడిస్తూ కూర్చున్నది. వృద్ధాప్యంలో తప్ప యెప్పుడు ధర్మం చేస్తారా అని సూర్యుడు తన మేలిమి నంతా అయాచితంగానే స్థిరచరాలన్నిటికీ పంచివేస్తున్నాడు. వేణు ఉద్యానవన పుష్పాలు కూడా కొంతదానాన్ని గ్రహించాయి. సుందర స్త్రీ శరీరంమీద అలంకారాలు శోభించినట్లు వాటి సహజశోభ యినుమడించింది.

వేణు యింటికి వచ్చేసరికల్లా ప్రకృతి సౌందర్యాన్ని క్రోలుతూ కూర్చున్న మాతా శిశువులతని కంట పడ్డారు. కొడుకును ఆడిస్తూ వుండగా భార్యను చూడటం తనకు యిదే మొదటిసారి. ఇదిచూచేసరికి అతని హృదయం ఆనందంతో వుప్పొంగింది. కళ్లవెంట బొటబొటా అశ్రువులు జారినాయి.

వేణు బేబీని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటూ 'జయా! మనకింతటి సౌభాగ్యం లేదుకదా!' అని దీనంగా అన్నాడు.

'మనకేమి తక్కువ? సిరీ సంపదా అన్నీ వున్నాయి. యింతేకాక మనయిల్లు స్వాతంత్ర్యనిలయం కూడాను. భారత దేశంలో యెవరయినా స్వాతంత్ర్యాన్ని దర్శించాలంటే నిజంగా మనింటికే చూడాలి' అన్నది జయ.

వేణు నొచ్చుకొని అన్నాడు 'అది కాదు జయా! ఇన్నిరోజులనుంచీ నీవేగ నున్నా యిప్పుడు పిల్లవాని కొరకైనా వుద్యోగానికి రాజీనామా యివ్వకపోతే పిల్లవాడు అన్యాయంగా పాడైపోతాడు. స్త్రీకి స్వాతంత్ర్యం కావాలి. ఆమె కూడా అన్నిటికీ అర్హురాలే. కాని ఆమె తనకర్తవ్యాన్ని మాత్రం మరిచిపోకూడదు. భర్త అసమర్థుడై కుటుంబాన్ని నిర్వహించ లేనప్పుడు స్త్రీ వుద్యోగం చేసి సంపాదించవచ్చు.

అప్పుడే ఆమెవిద్య ఆదర్శప్రాయ మవుతుంది. భర్త విపదశలో కూడా ఆమె విద్య వుపయోగపడుతుంది. అన్నివిధాలా సమర్థుడయిన భర్తవుండగా భార్య వుద్యోగం చేయటం హిందూస్త్రీ ధర్మానికి కేవలం విరుద్ధం. ఇది స్త్రీ స్వాతంత్ర్య మనిపించుకోదు. కేవలం ఊడిగం. ఇన్ని దినములనుంచీ భర్త ఊడిగం చేసి భార్యను స్వతంత్రురాలినిగా వుంచుతున్నాడు. ఎన్ని అవమానాలుపడి సహించైనా భార్యగౌరవాన్ని నిలబెట్టుతున్నాడు. స్వాతంత్ర్యానికి సరిఅయిన అర్థం తెలియక మీ స్వాతంత్ర్యాన్ని మీరే నీటగలుపుకుంటే దీనికి యెవరు బాధ్యులు?'

జయ:- "మీ వాక్చాతుర్యము చాలా ప్రశంసనీయమయినది. పిల్లవాని పేరుమీద ఒక్కసారి మీ అభిప్రాయాన్నంతా వెల్లడి చేశారు. ఇంకే మీ వుద్దేశ్యము తెలిపరచక పిల్లవాని పేరెందుకు? పిల్లవాని యందు మీకెంత బాధ్యత వున్నదో నాకూ అంతే. హిందూ సంస్కృతి పేరిట మన పిల్లలను పిరికిపందలుగా తయారు చేస్తున్నారు. వాళ్లను చిన్నప్పటినుంచీ స్వావలంబనం అలవాటు చేయాలి. తల్లిదండ్రులు వాళ్ళవెనుక సహాయభూతులు గానుండి వాళ్లను ఎందుకూ పనికిరానివాళ్లుగా చేయకూడదు. ఇతర దేశాలలో కంటే మనదేశంలో పిరికిపందలు యెక్కువగా తయారు కావటానికి యిదే కారణం."

బొగ్గులు కాల్చేవాడికి మొక్కల సౌందర్యం యేమితెలుస్తుంది? పిల్లలని పెంచటమంటే యేదో ఒకవిధంగా పెద్దవాళ్లను చేయటం మాత్రమేనని తెలుసు ఆతాయికి. పిల్లలను ఆదర్శప్రాయంగా తయారు చేయటమంటే పాపమూ మూర్ఖురాలికేం తెలుస్తుంది?

బేబీని వంటయింటికి యెదురుగావున్న హాలులో గిలక్కాయలిచ్చి కూర్చోపెట్టేది. ఆమెతన పని చేసుకుంటుండేది. బేబీ బొమ్మలన్నీ పాడుచేస్తూ కూర్చునేవాడు. అప్పుడప్పుడూ పాకాడటానికి ప్రయత్నం చేస్తూ పడేవాడు కూడాను. కాని ఆమె మాత్రం తనపని కానిది ఇటు చూడనైనా చూచేదికాదు. కొంచెంసేపు యేడ్చి బ్రతిమాలేవాళ్లు యెవరూ లేకపోవటంచేత బేబీ తిరిగి తన ఆటలో లీనమైపోయేవాడు.

నెమ్మదిగా బేబీ పాకటం నేర్చుకొన్నాడు. పాకటం వచ్చింది మొదలు బేబీ చాలా అశుభ్రంగా కనిపించేవాడు. పాకటం రాకముందు నీళ్లు యెప్పుడుపోసినా శుభ్రంగానే వుండేవాడు. ఆమెకు జ్ఞాపకం వచ్చినప్పుడు నీళ్లుపోస్తే కాళ్లువచ్చినపిల్లాడు శుభ్రంగా యెట్లా వుంటాడు? ఈమట్టి అంతా శరీరంలో నిలవవుండడంచేత వళ్లంతా కురుపులు లేచాయి. ఏది యెలావున్నా తల్లివచ్చేవరకు మాత్రం చాలా శుభ్రంగా వుంచేది. అహారమివ్వటానికి నిద్రపుచ్చటానికి అసలు వేళా పాళా వుండేదికాదు. ఆమె యిష్టమువచ్చినప్పుడు యిన్నిపాలు పోసేది. ఒక్కొక్కసారి బేబీ యేడ్చి యేడ్చి సొమ్మసిల్లినట్లు నిద్రపోయేవాడు. అతనికి తల్లిదండ్రులు అగంతకుల్లాగా కనిపించేవారు.

బేబీ నడక నేర్చుకోవటానికి యిదే ప్రథమదినం. తాయి కునికిపాట్లు పడుతూ, చుట్టకాల్చుకుంటూ గుమ్మంలో కూర్చుంది. బేబీ దొడ్లో మామిడి చెట్టునీడన ఆడుకుంటూ ఆడుకుంటూ నడక నేర్చుకోవాలని ప్రయత్నించ మొదలుపెట్టేడు. రెండు మూడు పర్యాయాలు లేవబోయి పడటం సంభవించింది. నాల్గవ సారి ఆ వంగీ వంగని లేతకాళ్లను వశపరచుకుని లేచి నుంచున్నాడు. కాని వెంటనే వెల్లికింత పడ్డాడు. తలలో సైలుబండి గొట్టం గుచ్చుకోవటం తడవుగా బొట బొటా రక్తం కారటం మొదలుపెట్టింది. చుట్టనిషాలో లీనమైనతాయి అసలటు చూడనేలేదు. ఇదేసమయంలో వేణువచ్చాడు. రక్తాన్ని చూచి భయపడ్డాడు. దగ్గరకు వెళ్లిచూచేసరికి తల చిల్లిపడివుంది. అతని పితృ హృదయం ఒక్కసారిగా వుప్పొంగింది ఏమీతోచక బేబీని యెత్తుకుని జయదగ్గరకు పరిగెత్తాడు.

గేటులోకి వెళ్లేసరికి జయ యెదురుపడింది. బేబీని చూడటంతోనే యిదేమిటని వ్యాకులంగా అడిగింది. వేణు యేమీ చెప్పలేక పోయాడు. అతని కపోలాలమీద అశ్రువులు సాంధ్యారుణకాంతులలో రక్తసిక్తములా అన్నట్లు ప్రకాశించాయి. ఇది చూచేసరికి జయకు సంగతంతా అర్థమై పోయింది. ఇహమాట్లాడటం మంచిదికాదనుకుంది. బేబీని యెత్తుకుని లోపలికి వెళ్లింది.

బేబీకి రెండవ సంవత్సరం ప్రవేశించింది. నడవటం బాగావచ్చింది. నెమ్మదిగా గడపలు దాటటం కూడావచ్చింది.

వేణుయిల్లు మెయినురోడ్డులోవుంది. అక్కడ కార్లు, బండ్లు, సైకిళ్లు, రిక్షాలు విరామం లేకుండా తిరుగుతూ వుంటాయి. ఆరోజున గవర్నరుకు స్వాగత మిస్తున్నారు. రోడ్డంతా కాయితపు పూల తోరణాలు గజి బిజిగా వ్రేలాడుతున్నాయి. సూర్యుడు ఈక్రొత్తరకపు పుష్పాలెక్కడనుంచి వచ్చాయా అని చకితుడై తన సహస్ర నయనాలతో తదేక ధ్యానంగా చూస్తున్నాడు. అక్కడక్కడా చలవ పందిళ్లు వేశారు. కార్లు రోజుకంటే చాలా హడావిడిగా తిరుగుతున్నాయి. రకరకాల హారను ధ్వనులు మిన్నుముడుతున్నాయి.

బేబీకూడా యీ స్వాగతంలో పాల్గొని కొంత ఆనందం పొందాలని నెమ్మదిగా రోడ్డుమీదకు వచ్చాడు. ఆ కార్లూ, పూలూ చూచేసరికి అతని బాల హృదయం ఆనందంతో వుప్పొంగింది. ఆ రంగు రంగుల పూలను లాక్కురావాలని ఒక్కసారిగా ముందుకు పరుగెత్తాడు. ఇంతలో ఒక్కకారు బేబీ మీదనుంచీ వేగంగా వెళ్లిపోయింది. అదేగవర్నరుగారి కారు. ఈదుర్ఘటన చుట్టూ నలుగురూ మూగేరు. వారిలో వేణుకూడా వున్నాడు. తనకొడుకు శవాన్నిచూచి నిశ్చేష్టుడై పోయాడు. ఈదుఃఖవార్త జయ చెవిన పడటానికి యెంతోసేపు పట్టలేదు. ఇదివినేసరికి ఆమెమీద పిడుగు పడ్డట్టయింది. కాలికి జోడుకూడాలేకుండా పడుతూ లేస్తూ పరుగెత్తుకు వచ్చింది. ఆభీభత్సాన్ని చూచేసరికి ఆమె పైప్రాణాలు పైనేపోయాయి. కదళీవృక్షంలాగా విరుచుకు పడిపోయింది.

బెంగుళూరులోనా ?

చిక్ పేట్—శాస్త్రీస్ హోటల్ లో బసచెయ్యండి

హోటల్ బృందావన్, హైగ్రౌండ్స్ హోటల్, రేస్ కోర్సుయెదుట.

శాస్త్రీస్ హోటల్, బెంగుళూరు సిటీవారి నిర్వహణక్రింద ప్రారంభింపబడినవి.